కథానిక

# వాడిన ఆకులు

చింతా శ్రీరామచంద్రమూర్తి

కథలంటే మానవునికి ఎంతో ఇష్టం. మోదాంతమైనా, ఖేదాంతమైనా మానవుని కథ వినడానికి ఎంత సొంపుగా వుంటుంది? అందుకనే లోకంలో ఒక మనిషిచుట్టూ పదిమంది మూగుతారు, వాడి కథేమిటో తెలుసుకోడానికి!

ఆ గ్రామానికి చివర గుబురుగా పెరిగిన చెట్లకు అవతలగా అస్తమిస్తూన్న సూర్యకిరణాల కుంకుమ రంగులో మసక మసగ్గా ఆ తురాయి చెట్టు ఒక్కటే నిలిచి వుంది. దాని కొమ్మలకుమాత్రం అందమైన పూలు లేవు. దాని ఆకులన్నీ నల్లగా మృత్యోన్ముఖమైన మానవుల శరీరాల్లాగ ఎంతో పేలవంగా కనపడుతున్నాయి. ఎంత మరణశయ్యాగతుడైతే మాత్రం, మానవునికి చరిత్ర అనేది వుండనే వుండదూ? ఆ చరిత్రనే ఆ చెట్టు ఆకులు వివరించాయి.

ఎన్నో హృదయాలు మా క్రిందనించి అనుక్షణమూ నడుస్తూనే వుండేవి. ఆ హృదయాలు చలించి చలించి ఏవో కబుర్లు చెప్పుకోవడం వాటికి అలవాటే. అయితే అవి మాత్రం పరివర్తన చెందలేదు, కాలం జరిగినా. కాలగమనంలో వుండే మహత్తర సత్యం వాటికి తెలియదని మాకు ప్రత్యక్షంగా నిదర్శనాలు కనిపించేవి వాటి కబుర్లలో వుండే అసత్యం వల్ల.

మేం ఈ చిగురునపడి మాడి బొగ్గయిపోడానికి కారణం లేకపోలేదు. ఆ వేసంకాలపు వెచ్చనిరాత్రి పన్నెండు గంటలలో మా తనువులు జీవన్మృతాలని- అనుకోడం తటస్థించింది. ఎవరేనా మాక్రిందనించి వెడుతూ 'మీ యీ స్థితికి గల కారణం ఏం?' అని అడగరు. కారణం వారికి తెలుసును కనక.

మాప్రక్కనే ఒక పూరిగుడిసె కాలి మారణహోమం అయింది. ఆ వేడి, ఆ కాక మాతో పాటు గాలికి ఎగిరే పచ్చని ఆకుల్ని చాలా వాటిని కాల్చివేసింది. ఆ మంటలు అబ్బా! రోదసీమార్గంలో ప్రళయంగా విహరించిన అగ్ని జ్వాలలు రిక్తహస్తాలతో వెళ్ళిపోలేదు. మాతో ఆడుకునే పచ్చని ఆకుల్ని ఎన్నిటినో భూమి మీదకు తీసుకువెళ్ళిపోయాయి. మామీద విహరించే ఎన్నో తియ్యటి పక్షిగానాల్ని అంతం చేశాయి అయినా క్షుద్రంగా మేం మాత్రం ఆ భీభత్సంలో పడి సగం సగం గాలి అసహ్యంగా కనిపిస్తాం ప్రకృతికి నేటికీ. అందుకనే మేం అంటాం: ప్రపంచంలో ఆరోగ్యవంతుడు జీవించాలి. ఆరోగ్యం లేనివాడు చనిపోవాలి. కాని మృత్యోన్ముఖంగా వున్న నికృష్ట జీవితాన్ని సహించడం కష్టతరం. మా స్థితీ అదే.

కాని ఒక్క సంగతి చెప్పగలం: మేం వుండబట్టే ఆ సత్యాన్ని చెప్పగలుగుతున్నాం. ఇక్కడ ఆ సత్యం అసత్యంగా మారిపోకుండా, గాలి అలలలో మొరపెట్టుకుని మమ్మల్ని బ్రతికించమని చెప్పుకుంటే, అవి మమ్మల్ని క్రిందకు రాల్చివేయకుండా బ్రతకనిస్తున్నాయి. అందుకనే నిమిషాలతంగా మేం జీవిస్తున్నది! మేం గాలిదేవుడికెంతో కృతజ్ఞులం. ఆ పూరిగుడిసె మాకు బాగా పరిచితం. మాలాగే అదీ ఒంటరితనం అనుభవించేది. మాలాగే తియ్యటి గానంతో ఆ గుడిసె ఆనందం అనుభవించడం మేం మరచిపోలేం. మీ గానాలు పక్షులవి. దాని గానాలు ఆ యింట్లో గృహిణివి.

అబ్బా! ఆ మంటలు ఎంత భీకర నృత్యం చేశాయి! ఆ మంటల అందం- ఆ అందంలో భయం పంపులు పంపులు తిరిగి ఆడుకుంది. ఆ మంటల్లోంచే ఆ లలిత కంఠం ఆఖరు సారిగా మేం విన్నది. ఈ మాటు ఆ పూరిగుడిసె అనుభవించింది సుఖం కాదు. కష్టంలోపల ఆర్తనాదం. ఆలోచించండి దాని సౌఖ్యం?

ఆ గృహిణిని మేం ఎరుగుదుం. చాలా కాలంనించి ఎరుగుదుం. మా క్రిందనుంచి నడిచి వెళ్ళ

నవ్వుతల్లా, ఆమె ముఖంలోకి చూసి, తియ్యటి మధురమైన రససంపత్తిని ఆస్వాదించిన ఘడియలు చాలా ఉన్నాయి. ఎప్పుడైనా గాలి, అలలు అలలుగా లేగి మా మీదనించి ప్రసరించినప్పుడు, మా హృదయాలు ఆనందంతో సంగీతం ఆలపిస్తవి. ఆమె కూడా ఆ సమయంలోనే మౌనాన్ని త్యజించి నవ్వుతూ కొన్ని గీతాలు పాడి వినిపించేది. ఆ ఉత్తమ క్షణాల్ని యీ నాటికీ మరువలేని ప్రకృతి ఎందుకో యిప్పుడు కళ్లవెంట నీరు కారుస్తుంది.

అబ్బ! గుండె ద్రవించి పోతుంది. ఆ మంటల్ని తల్చుకుంటే. ఘనీభవించిన ఆ మంటలకి సాదృశ్యంగా నేటికీ దేనినీ సూచించలేక పోతున్నాం. వెలవెలమని పడిపోయిన గోడలతీరు నేటికీ మా కళ్లకు కట్టినట్లే ఉంటుంది. ఆ భీంద్రించే మంటల వరుసల్లో కూడా జ్వలితమైన ఆమె మనస్సును చూడగలిగాం. అదే ఆఖరుసారి మేం ఆమెను చూసినది. తీవ్రంగా మంటలు ఆవరిస్తున్నాయి. ఆ మంటల నడుమ నిల్చి అనుభవాల్ని స్మరిస్తోందా? మహావిశ్వాల అంతర్యాన్ని గురించి ఆలోచిస్తోందా?

ఏం అనుకుంటోంది? అతిఘోరమైన రాత్రిలో వెచ్చని ఆ రాత్రిలో, ఆ మంటల నడుమనిల్చి ఆమె అశ్రువుల్ని పీల్చుతుంది. ఆవేశం శోకాన్ని తరుముగా, ఆమె రసస్ఫూర్తి పొంది. విశాలమైన ఆమె నల్లటి కనురేఖల్లోంచి హృదయానుభూతులు చుక్కలు చుక్కలుగా వర్షించాయి భూమి మీదకు.

ఏం అనుకుంటోంది? మంటలు మీదకు వచ్చేస్తున్నాయి. మనుష్యులు పుడతారు. పుట్టి అనుకుంటూనే చనిపోతారు. ఆ మధ్య కాలంలో అనుభవించిన సుఖజీవితాన్నంతటినీ మరువటం ఎల్లాగ? అవమానం, ఓర్వలేనితనం, చీకటి కొండలా తరుముతూ, మానవ వ్యవస్థని ఉపాభూశం చేస్తుంటే జీవించటం కష్టతరం కాదా? ఆమె హృదయంలోంచి విచారం ధారగా కురిసింది.

ఏం అనుకుంటోంది? మంటలు మీదకు వచ్చేస్తున్నాయి. భౌతికశరీరాలు శాశ్వతం కావు. కానీ తన శరీరపు తీరుల్లో అందాన్ని ఎందుకు సృష్టించాడు? తన అందాన్ని ఎవడో యింకొకడు కామించడం తన దురదృష్టమా? అయ్యో! ప్రపంచంలో అందం, స్వార్థాలకు లొంగిపోతే అశాంతి తప్పదు. తను అందంగావున్నట్టే ఆమె ఎప్పుడూ భావించలేదు. కాని ఆ కళ్లు, వ్యసన పూరితమైన ఆ నేత్రాలు - ఆ పరాయి పురుష నేత్రాలు ఆమె అందాన్ని మోహించాయి. వాడికోసం, వాడి కోసం, వాడి శరీరంకోసం ఆమె శరీరాన్ని అర్థించాయి. ఆమె జలదరించింది. ఆమె అందమూ, శరీరమూ, మనస్సూ అన్నీ ఆయనకోసం, భర్త కోసం పవిత్రమైన ఆ మంగళ విగ్రహానికి హారతిగా వెలిగించింది. పరులకోసం కాదు. ఆమె నిశ్చల సమాధిలోకి వెళ్ళిపోయింది. మళ్లా ఆ కళ్లు అసహనంగా చూసాయి. ఆ పరాయి కంఠం మృదువుగా అరిచింది.

'నందా! నీ భర్తకేం తెలియదులే. నీ అందాన్ని చూసి అనుభవించకండా చనిపోలేను. నా కోరిక క్షుద్రంగా కనిపించవచ్చు. కాని, నేను ఏం చెయ్యగలను? నా హృదయభారాన్ని జయించలేను. నా కోరికకి తగిన సమాధానం చూపెట్టు. ఈ విశ్వంలో ఎన్నో పువ్వులు పూయటం లేదూ? వాటివాటి అందం ఎవరికో ఒకరి కోసమే అంకితం కాబడుతున్నాయా?'

ఆమె మాట్లాడలేదు. ఆమె దేహం కంపించింది. రూపెత్తిన అసహనం ఆగి మాటాడింది.

'నందా! నీలోని పవిత్రత నే నెరుగును. నా హృదయంలో జనించిన బాధకి భిక్ష పెడతావనుకున్నా. కాని నీలోని పవిత్రతే నిన్నడ్డుకుంది. ఒక్క సత్యం మాత్రం నేను చెప్పక తప్పదు. నివ్వు నా కోరికని మన్నించని కారణంచేత, నీ జీవితమే అంతం అవటం నిస్సందేహం. నువ్వు బ్రతికి బట్ట గట్టడం యింక నేను చూసి సంతోషించలేను. సెలవు. వెళ్ళి పోతున్నాను.'

ఈ మాటలు అంటూ ఆ క్షుద్ర మానవస్వరూపము వెళ్ళిపోయింది. నంద కొన్ని క్షణాలు మౌనంగా ఊరుకుంది. ఈ విషయం చెప్పి, తన భర్త మనస్సు పాడు చేయటం ఆమెకు యిష్టం లేదు. తను ప్రపంచానికి ఏ ఉపకారం చెయ్యమన్నా చేస్తుంది. అసహనంకోసం తనజీవితాన్ని త్యాగం చెయ్యటం ఆమెకు ఎంతో ఆనందాన్ని కలగ చేస్తుంది. తను ఎల్లాగా మరణిస్తుంది. అది సత్యం. కాని పవిత్రమైన భర్త ప్రపంచంలో

ఒంటరిగా జీవిస్తారు. ఆమె కళ్లల్లో శోకం సెలయేరై పారింది.

ఏం అనుకుంటోంది? మంటలు మీదకు వచ్చేస్తున్నాయి. జీవితంలో ఉత్తమ ఘడియలు కొన్ని ఉంటాయి. వాటిని గురించి ఆలోచిస్తేనే ప్రతి జీవి విచారంనించి తప్పుకోగలదు. తన జీవితంలో ఆ రాత్రి...

వెన్నెల లేక పోయినా, ఆయన హృదయ ధావళ్యంవల్ల ఆ చీకటి అంతా వెలుతురుగా మారింది. ఆయన దగ్గరగా చేరి కేశాల్ని స్పృశించి అన్నారు:

'నందా! ఏం అల్లా వున్నావేం? ఆరోగ్యం సరిగ్గా ఉండటంలేదా? మూగవై ఏ బాధల్ని అనుభవిస్తున్నావ్? నీ నిర్లిప్తత నన్నూ, నా ప్రశాంతతనీ భంగపరుస్తోంది. నీలోని వ్యక్తిత్వాన్ని నే నెరుగుదును. పనిమీద గ్రామాంతరం వెడుతున్నాను. నువ్వు జాగ్రత్త.'

ఆయన హస్తాలు ఆ క్షణికంలోనే ఆమెను దగ్గరగా తీసుకొన్నాయి. హృదయాలు కూడా ఆ ఉత్తమస్థితిలో సన్నిహితంగా చేరిపోయినయి. ఆయన గ్రామాంతరం వెళ్ళిపోయారు. తను ఒంటరిగావుంది దారికోసం. కాని 'జాగ్రత్త' అన్నారు. మంటలు వలయాలుగా దొర్లి మీదకు వచ్చేస్తున్నయి. తను మృత్యువునుంచి తప్పించుకోడానికి ప్రయత్నించటం లేదు. ఆయన గ్రామంలోకి వచ్చాక తన అజాగ్రతకి దుఃఖిస్తారు. తను చనిపోయినా ఆమె బాధపడదు, కాని వారి పవిత్రమైన ఉజ్వలనేత్రాల్లోంచి బిందుశకలాన్ని కూడా ఆమె చూసి సహించి ఊరుకోలేదు. ఏంచేయటం? శోకం వెల్లువై ప్రవహించింది.

ఏం అనుకుంటోంది? మంటలు ఆ గృహమంతా వ్యాపించాయి. తప్పదు. తప్పదు. మరణం తప్పదు. నిజం. తను చనిపోతోంది. ఆసహానం హుంకరించాక తను ఎల్లాగా నాశనమై పోతుంది. ఇదిగో! కాలి మారణహోమమై పోతోంది. ఆమె ప్రశాంతతతో ఆలోచించింది. కళ్ళు మూసుకుంది. తనకోసం దుఃఖించే వారెవరైనా ఉన్నారా? అయ్యో కనిపెంచిన తలితండ్రులు. వారు పంపేటప్పుడు, పసుపూ, కుంకుమా మాంగళ్యసూచకంగా ఇస్తూ, ఆయుష్మకోసం దీవించారు. కన్నతల్లి, హృదయం ప్రేమతో ద్రవీభూతం కాగా, దగ్గరగా తీసుకుని 'మళ్ళీ వేగంగా రాతల్లీ! నీకోసం ఎదురు చూస్తుంటాను' అంది. కన్నతండ్రి శోకతప్త నయనాల్తో 'అమ్మా! మాయింటికి లక్ష్మీదేవిలా అవతరించావు. నువ్వు పుట్టాకే మాకు యింత కలిసింది. వేగంగా రా తల్లీ' అన్నాడు. అంతటి ప్రేమమాయుల్ని మళ్ళా చూడలేదు. తను చనిపోతుంది. ఈవార్త విని వారు ఏమవుతారు?

అయ్యో! ఆమెలో విచారం నదిలా ప్రవహించింది.

ఏమనుకుంటోంది? మంటలు మీదకు వచ్చేస్తున్నయి. విచారించి ప్రయోజనం లేదు. ఆమె కనుకొనలలోంచి, మహత్తరమైన యీ విశాల విశ్వంకేసి ఆఖరుసారిగా చూసింది. ప్రతి అణువులోనూ జీవచైతన్యం మిసమిసలాడుతూ కనిపించింది. అన్నిజీవాల సంచలనం వల్లనే యీ పృథ్వి ఎప్పుడూ కలకలలాడుతూ వుంటుంది. ఆహా! ఏది ఉన్నా, ఏది లేకపోయినా, బ్రతకటంలో ఎంత లావణ్యం ఉన్నది. కాని ఏం ప్రయోజనం? ఏకోశాన చూసినా, జీవకారుణ్యం లేని మానవులు అసహనంతో, కుళ్ళుతో ప్రయాణంచేస్తూ, ప్రపంచపు శుభసంస్కృతినీ, లాలిత్యాన్నీ కాల్చివేస్తున్నారు. ఏమైనా మహావిశ్వం యిది!

చూస్తూ చూస్తూ ఆమెకళ్ళు గ్రామానికి చిట్టచివర చెట్లగుబురులో దృశ్యాదృశ్యంగా... దూరంగా ఎవరది? పవిత్రమూర్తి గ్రామాంతరం నించి ఆనందంతో ప్రత్యక్షమయ్యారు. ఎంతో ఆత్రుతతో తలుపు తట్టారు. తను వెళ్ళింది 'నందా! యీ రోజులన్నీ విసుగ్గా ఒంటరితనంతో గడిపేశావా? ఏమీ అనుకోకు, ఆలస్యం అయింది' అన్నారు. తను మౌనంగానే వుంది. తన మౌనాన్ని ఛేధించే శక్తి ఆయన వాక్కుల్లో వుంది. తను ఎంతో ఆనందంతో నవ్వింది—అంతా భ్రమ, అంతా కల్పన— మంటల్లోపడి కాలిపోతూన్న తను— బ్రతకడం ఎక్కడ, భర్తని కలుసుకోడం ఎక్కడ?

ఆయన రావడం తథ్యం. ఆయన వస్తారు. ఆలసటతో వస్తారు. తన కాలి పోయిన ఇంటినీ, కాలిపోయిన యిల్లాలినీ చూసి మూర్ఛపోతారు.

అయ్యో - అయ్యో - ఆమె హృదయంలో శోక సముద్రాలు కట్టలు తెగి ప్రవహించాయి. మహా సముద్రమంత గంభీరమైన ఆమె శోకం, తన కెరటాలతో ఆమెను తనలో యిముడ్చుకుంది. ఆమె నిశ్శబ్దతలో లీనమైంది.

అంతే. ఇంక ఆమె ఏమీ అనుకోలేదు. మంటలు క్రమంగా ప్రాకి పోయాయి. కదలిక లేని ఆమె శరీరం అఖండమైన ఆ మంటల్లో కలిసిపోయింది. ఆఖరు సారిగా ఆమె శరీరాన్ని చూసి సంతృప్తి చెందాం మేం. ఆమె యింక యీ ప్రపంచంలో లేదు.

ఆమె ఆత్మకి శాంతి కలగ చేయమని కోరుతున్నాం. తరువాత దూరంగా ఉన్న నివాసులు వచ్చి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. కాని విఫలులయ్యారు. అల్లాగే చూస్తూ వెళ్లిపోయారు. వెళ్లి పోతూ ఆ హృదయాలు ఎన్నో విషయాల్ని గురించి మాటాడుకున్నవి.

'వెర్రిపిల్ల నంద! ఆత్మహత్య చేసుకుంది. అంత ఖర్మ ఎలా కట్టిందో పాపం!'

'భర్త ఏం బాధలు పెట్టాడో! మనిషికి బాధలు అమితమైన బరువైనప్పుడే ఆత్మహత్యకు సిద్ధపడుతుంది'

'అయ్యో! నంద కాపరానికి రావడం మేం ఎరుగుదుం. వెర్రిపిల్ల అప్పుడే చనిపోయిందా! భర్త యింటి దగ్గర లేడు కూడా'

'నంద అజాగ్రత్తయిన మనిషి కాదు పాపం. పొయ్యిలో ఏమన్నా నెరసు వుండి పోయిందేమో, యిల్లు తగలడ్డానికి'

ఆ హృదయాలు అల్లాగే వెళ్ళి పోయాయి. అయితే వారు సత్యాన్ని తెలుసుకోలేదని మేం కించపడం. వారిని నిందించనూ నిందించం. కారణము అది ప్రపంచం. ప్రపంచం ధర్మం అంతే.

కాని ఆ నిశ్చలమైన రాత్రిలో, ఆ వేసవి కాలము వెచ్చని చీకటిలో నంద మంటల్లో పడి మరణించడం మేం కళ్లారా చూశాం. ఆమె మరణంలో వున్న సత్యాసత్యాలు మాకు తెలుసు. ఒక్క ఆసహానం కోసం ఆమె తన జీవితాన్ని గత్యంతరం లేకనే అర్పణ చేసింది.

ఆ అర్ధరాత్రి - వాడు - నల్లటి దుస్తులతో వచ్చి, యింటి తలుపులన్నీ బంధించి యింటికి కాగడాలతో నిప్పంటించిన సంగతి - భూమ్యాకాశాల మధ్యని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో బ్రతికే మా కాక్కుళ్ళకే తెలుసు.

వెర్రిపిల్ల నంద! ప్రపంచంలో అందాన్ని ఆస్వాదించటం, నేర్చుకో గలిగినప్పుడే నిజమైన మానవత్వం వెల్లివిరుస్తున్నట్టు! స్వార్థం కోసం, అందాన్ని ఆకాంక్షించటం, అందాన్ని హింసించటం నేర్చుకుంటే మానవజాతికి ఎంత కాలానికి ముక్తి! ఎంత కాలానికి ముక్తి! ఎంత కాలానికి ముక్తి!

ఈ సత్యాన్ని ఉద్బోధించడానికే మేం యిక్కడ వున్నది. ఈ సత్యం గాలుల్లోని అలల ద్వారా ప్రపంచానికి చాటబడుతుంది ప్రపంచం ఏమనుకున్నా.

# పిల్లవాడి చదువు

యం. యస్. చలం

కాగితాలు కలం ముందు వేసుకుని 'ఏమి వ్రాయాలా? అనితలో దవరపడ్డాడు. కాలుతున్న సిగరెట్. పొగను వృకరాలు చుడుతోంది. చేతివ్రేళ్లు తమ పరిపాటి ధర్మాన్ని నిర్వహించేందుకు తలమునకి మళ్లినా ఆలోచన సాగటం లేదు. వ్రాతముందు కూర్చుని వ్రాయవలసిన విషయాన్ని గురించి ఆలోచించే అలవాటు ఆలోచనా శక్తికి లేనందువల్ల తికమకగా వుంది. ఏమిటి వ్రాయటం?

సమాధానంగా ఎప్పుడో, ఎవరో, ఎక్కడో వ్రాసిన విషయం జ్ఞప్తికి వచ్చింది. 'వ్రాయగల ప్రతిభావంతుడు ఏ విషయం మీదనైనా వ్రాయగలడు.' నేనూ ప్రతిభావంతుణ్ణే! బీరువాల తరబడి కాతా పుస్తకాలు వ్రాసినవాణ్ణే. కాని ఏ విషయం మీదనైనా రాయగల ప్రతిభ లేకపోవటం నా దురదృష్టం. రాయగల ప్రతిభావంతుడు ఏ విషయం మీదైనా సరే రాయాలంటే అన్ని విషయాలు తెలిసి వుండాలిగదా! అన్న సందేహానికి తావులేదు. వ్రాయగల ప్రతిభతో తెలియని విషయాన్ని గురించి రాయటం